క్లుప్తంగా

పశుగణన ప్రారంభం



బర్లిలో పశుగణన నిర్వహించిన పశువైద్యాధికారి గణేష్

బలిజిపేట: మండలంలో పశుగణన కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. అందులో భాగంగా బర్లి గ్రామంలో మండల పశువైద్యాధికారి గణేష్ ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి పశువులు ఉన్నవీ, లేనివీ అడిగి తెలుసుకున్నారు. పశువులు ఉండేవారి వివరాలను సేకరించి నమోదు చేశారు. పశువులతోపాటు మూగజీవాలు ఏమైనా ఉంటే వాటి వివరాలు తెలుసుకున్నారు. వచ్చే సంవత్సరం ఫిబ్రవరి నెలాఖరువరకు పశుగణన నిర్వహించనున్నట్లు వైద్యాధికారి గణేష్ తెలిపారు. పశుగణన నిమిత్తం 17మంది ఎన్యూమరేటర్లను నియమించినట్లు చెప్పారు.

పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద పోలీసుల మాక్‌డ్రిల్



చెక్‌పోస్టు వద్ద నిర్వహిస్తున్న మాక్‌డ్రిల్

పాచిపెంట: మండలంలోని పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద పోలీసులు శుక్రవారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. గంజాయి, సారా అక్రమ రవాణా నేపథ్యంలో వాటిని గుర్తించడానికి ప్రత్యేకంగా శిక్షణ పొందిన జాగిలాలతో మాక్‌డ్రిల్ చేశారు. ఈ మేరకు డ్రోన్ కెమెరాలను ఉపయోగించారు. వాహనాల తనిఖీ విషయంలో తీసుకోవాల్సిన చర్యలపై పోలీసు సిబ్బందికి రూరల్ సీఐ రామకృష్ణ పలు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్సై సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

బాలల సత్వర చికిత్స కేంద్రంలో పాము కలకలం



బాలల సత్వర చికిత్స కేంద్రంలో పామును హత మార్చిన దృశ్యం

పార్వతీపురంటౌన్: ఎవరైనా పాముకాటు బారిన పడితే గురైతే తక్షణమే ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి యాంటీ వీనం ఇంజక్షన్ చేయించుకుని చికిత్స పొందుతారు. అటువంటిది ఆస్పత్రిలోనే పాములు సంచరిస్తే రోగులు ఎక్కడికి వెళ్లాలి? అనే ఆందోళన వ్యక్తమవుతోంది. పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి కూతవేటు దూరంలో ఉన్న బాలల సత్వర చికిత్స కేంద్రంలో శుక్రవారం సంచరించిన పాము కలకలం రేపింది. ఆస్పత్రిలో పాము సంచరించడంతో రోగులు భయభ్రాంతులకు గురయ్యారు. దీంతో సిబ్బంది పామును హతమార్చారు. దీన్నిబట్టి ఆస్పత్రిలో పారిశుద్ధ్య పనులు ఏ రకంగా జరుగుతున్నాయో అర్థమవుతోందని, ఇప్పటికైనా పారిశుద్ధ్య పనులపై దృష్టిసారించాలని రోగులు, స్థానికులు కోరుతున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పట్టణ సీఐ అప్పలనాయుడు

సాలూరు: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని పట్టణ సీఐ అప్పలనాయుడు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ అన్నారు. రహదారి భద్రత అవగాహన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సాలూరు పట్టణంలోని లారీయూనియన్ సభ్యులు, డ్రైవర్లు, క్లీనర్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వాహనాల డ్రైవింగ్, పార్కింగ్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సరుకు రవాణా విషయంలో అప్రమత్తంగా ఉండాలని, అనుమానంగా ఉన్న వ్యక్తులను వాహనంలో ఎక్కించరాదని స్పష్టం చేశారు. ఎక్కడ అనుమానాస్పద సంఘటన జరిగినా వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.మత్తుపదార్థాలు రవాణా చేయడం, సేకరించడం నేరమని పేర్కొన్నారు. డ్రైవర్లు,క్లీనర్‌లు ప్రమాదానికి గురైతే చేయాల్సిన ప్రథమ చికిత్స, గుండె జబ్బులు, పాముకాటు సమయంలో తీసుకోవాల్సిన ప్రథమ చికిత్స తదిత ర అంశాలపై డాక్టర్ నారాయణరావు వివరించారు.

పట్టణంలో ర్యాలీ

పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని మెయిన్‌రోడ్డు వద్ద సీఐ అప్పలనాయుడు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అమరవీరులైన పోలీసులు సేవలను గుర్తుచే శారు. కార్యక్రమంలో పోలీసులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురంలో ట్రాఫిక్ టెర్రర్..!



పట్టణంలో భారీ వాహనాల కారణంగా జామ్ అయిన ట్రాఫిక్

- పట్టణం మీదుగా అతి భారీ వాహనాల రాకపోకలు
- వాహన చోదకులకు తప్పని ఇక్కట్లు
- బైపాస్ రహదారి నిర్మాణం తప్పనిసరి

పార్వతీపురంటౌన్: జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ జఠిలమవుతోంది. నిత్యం రద్దీగా ఉండే పట్టణ ప్రధాన రహదారి మీదుగా భారీ వాహనాలు రాక పోకలు సాగిస్తుండడంతో ప్రజలు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పఋతున్నారు. పార్వతీపురం మున్సిపాల్టీలో 58 వేల మంది జనాభా ఉన్నట్లు అధికారుల అంచనా. అయితే జిల్లాకేంద్రంగా ఏర్పాటైన తర్వాత పట్టణ జనాభా, వాహనాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. మరోవైపు జిల్లా నలుమూలల నుంచి రోజూ వర్తకులు, విద్యార్థులు, వివిధ రకాల పనులపై పట్టణానికి వస్తుంటారు. దీంతో జిల్లాకేంద్రం నిత్యం రద్దీగా ఉంటోంది. పార్వతీపురం పట్టణం మధ్య నుంచి చిలకపాలెం, రామభద్రపురం, కూనేరు పోయే ప్రధాన రహదారి ఉండడం వల్ల విశాఖ నుంచి ఒడిశా, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ తదితర రాష్ట్రాలకు రోజూ భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి.

దీంతో శబ్ద, వాయు కాలుష్యంతో పాటు ట్రాఫిక్ సమస్యలు తప్పడం లేదు. ఇదిలా ఉండగా స్థానిక దీప్తి లాడ్జింగ్ నుంచి పాతబస్టాండ్ కూడలి వరకు రహదారి ఇరుగ్గా ఉండడంతో పాదచారులు, వాహనచోదకులు నానా అవస్థలు పడుతున్నారు. ఎంతోమంది ప్రమాదాలకు గురవుతున్నారు. పట్టణ ప్రాంతంలో ట్రాఫిక్ నియంత్రణ పోలీసులకు కత్తిమీద సాములా మారింది.

బైపాస్ తోనే ట్రాఫిక్ కష్టాలు దూరం

పార్వతీపురం పట్టణంలో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంది. నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ సమస్య పరిష్కారానికి సమీపంలో గల వెంకంపేట గ్రామ గోలీల నుంచి సూర్య పీఠం వరకు బైపాస్ నిర్మిస్తే ట్రాపిక్ కష్టాలు తప్పుతాయి. ఏదేమైనా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి, బైపాస్ రోడ్డు నిర్మించేలా చర్యలు తీసుకోవాలి.

– పిట్ట ఆదినారాయణ, ఆటో డ్రైవర్, పార్వతీపురం

తీవ్ర ఇబ్బందులు

వాహనచోదకులు పట్టణంలో ప్రయాణం అంటే భయపడుతున్నారు. పట్టణం మధ్య నుంచి భారీ వాహనాలు వెళ్లడం వల్ల విద్యార్థులు, ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బైపాస్ రోడ్డు నిర్మిస్తే ట్రాఫిక్ నియంత్రణతో పాటు ప్రమాదాలు నివారించొచ్చు. పాలకులు దృష్టి సారించి బైపాస్ రోడ్డు నిర్మించాలి.

– అవనాపు సంతోష్, వాహన చోదకుడు, పార్వతీపురం

గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

- ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీఓకు వినతిపత్రం అందజేత



ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీఓ అశుతోష్ శ్రీ వాత్సవకు వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు

పార్వతీపురంటౌన్: ఏజెన్సీలోని గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గుమ్మలక్ష్మీపురం మండలంలోని బయ్యాడ గ్రామానికి చెందిన గిరిజనులతో వచ్చి ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీఓ అశుతోష్ శ్రీ వాత్సవను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బయ్యాడ గ్రామానికి రేగిడి నుంచి పక్కా రహదారి నిర్మించాలని డిమాండ్ చేశారు. రహదారి సౌకర్యం లేకపోవడం వల్ల వ్యాధులు ప్రబలే సమయంలో వైద్యం కోసం నానా అవస్థలు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామానికి రోడ్డు లేకపోవడం వల్ల అంగన్వాడీ, పాఠశాల భవనాలు పూర్తికాక ఇళ్లలనే తరగతులు నిర్వహిస్తున్నారని వాపోయారు. గ్రామంలో సురక్షిత మైన తాగునీరు కూడా లేదని తెలిపారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీఓ మాట్లాడుతూ గ్రామాన్ని సందర్శించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బయ్యాడ గ్రామానికి చెందిన పంచాయతీ వార్డు మెంబర్ నిమ్మక రంగారావు, జీలక ప్రసోమాలు, నిమ్మక ప్రకాశ్, నిమ్మక కామేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘాటెక్కిన వెల్లుల్లి



పార్వతీపురం: మార్కెట్‌లో కూరగాయల ధరలతోపాటు ఉల్లి, వెల్లుల్లి ధరలు కూడా సామాన్యుడికి అందనంత ఎత్తులో ఉంటున్నాయి. కిలో ఉల్లి రూ.60 కాగా, వెల్లుల్లి రూ.380 నుంచి రూ. 400 వరకు ధరలు పలుకుతున్నాయి. ఉల్లి, వెల్లుల్లి లేకుండా ఏ కూరా రుచికరంగా ఉండదు. కొద్ది నెలల క్రితం వెల్లుల్లి ధర రూ.130 నుంచి రూ.150 ఉండేది. కేవలం రెండు నెలల్లోనే రెండున్నర రెట్లు ధర పెరిగి దాదాపు రూ. 400లకు వెల్లుల్లి చేరుకుంది. దీని ధర ప్రభావం సామాన్య, మధ్యతరగతిపై తీవ్రంగా పడుతుంది. వాతావరణ పరిస్థితులు, అధిక వర్షాల కారణంగా పంట దిగుబడులు తగ్గాయని, దీంతో ధరలు విపరీతంగా పెరుగుతున్నట్లు వ్యాపార వర్గాల వారు పేర్కొంటున్నారు. ప్రభుత్వం ధరలు నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

పశు అక్రమ రవాణాపై చర్యలు

పార్వతీపురం టౌన్: పశు అక్రమ రవాణాపై సమాచారం మేరకు చర్యలు తీసుకుంటామని జిల్లా పశు సంవర్థక అధికారి డా.ఎస్ మన్మథరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా నుంచి ఇతర ప్రాంతాలకు పశు అక్రమ రవాణా విషయమై ఫిర్యాదులు, సమాచారం తమ దృష్టికి వచ్చిన వెంటనే సంబంధిత పోలీస్‌శాఖ, రెవెన్యూ శాఖ, మార్కెటింగ్ శాఖ, రోడ్డు రవాణా శాఖ, జంతు సంరక్షణ కమిటీ సహకారంతో బాధ్యులపై చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. జిల్లాలో అన్ని పశువైద్య కేంద్రాల పరిధిలో రైతులకు పశు వైద్య సేవలు అందజేయనున్నట్లు జిల్లా పశు సంవర్థక అధికారి డా.ఎస్ మన్మథరావు తెలిపారు. పశు వైద్య కేంద్రాలకు అవసరమైన నూతన భవన నిర్మాణాలు, మరమ్మతులు చేపట్టే నిమిత్తం పై అధికారులకు నివేదిక సమర్పించినట్లు చెప్పారు.

12వ వేతన కమిషన్‌ను వెంటనే నియమించాలి

- ఏపీటీఎఫ్ డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎన్.బాలకృష్ణ

పార్వతీపురంటౌన్: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల వేతన సవరణకు సంబంధించిన 12వ పీఆర్‌సీ కమిషన్‌ను తక్షణమే నియమించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహేష్, బాలకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు మండలంలోని నర్సిపురం ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీఆర్‌సీ కమిషన్‌ను నియమించడంతోపాటు ఐఆర్ ప్రకటించాలని కోరారు. గతేడాది జూలై 1వ తేదీ నుంచి నూతన వేతన సవరణను అమల్లోకి తేవాల్సి ఉండగా, ఇప్పటివరకు కమిషన్ చైర్మన్‌ను నియమించకపోవడం దారుణమన్నారు. 90 నెలలకు సంబంధించిన డీఏ బకాయిలు చెల్లించాల్సి ఉండగా, ఉమ్మడి విజయనగరం జిల్లా పరిధిలో ఏడు నెలల నుంచి రూ.100 కోట్ల పీఎఫ్ బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. ఏపీజీఎస్ఐ, సరెండర్ లీవ్ నగదు, ఉద్యోగ విరమణ అనంతర ప్రయోజనాలు, సీపీఎస్ మార్జిన్ గ్రాంట్ తదితర బకాయిలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సంఘాలతో విద్యాశాఖ మంత్రి సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ పర్యటనలో జిల్లా కార్యవర్గ సభ్యుడు బెహరా సంతోష్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తిరుమల, రమేష్, నాయకులు బీవీఆర్‌కే నాయుడు, కాశి, చుక్క రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు ఉద్యోగభద్రత కల్పించాలి



పట్టణంలో వలంటీర్లు నిర్వహిస్తున్న ర్యాలీ

సాలూరు: వలంటీర్లను విధుల్లో కొనసాగించి, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షురాలు బలగ రాధ డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని కొంకివీధి కల్యాణ మంటపం వద్ద వలంటీర్ల యూనియన్‌తో సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం నిరసన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు వలంటీర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. వారిని విధుల్లోకి తీసుకుని కొనసాగించి, నాలుగు నెలల బకాయిలను తక్షణమే చెల్లించాలని చెప్పారు. ఎన్నికల హామీలో భాగంగా వలంటీర్లకు పదివేల రుపాయలకు గౌరవ వేతనం పెంచాలని కోరారు. వలంటీర్లను విధుల్లోకి ప్రభుత్వం తీసుకోకుంటే జిల్లా కేంద్రంలో ధర్నా చేపట్టి ర్యాలీ చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పలువురు వలంటీర్లు పాల్గొన్నారు.

28న ధర్నా విజయవంతం చేయండి



ధర్నా కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

సాలూరు: మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 28న తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కోరారు.ఈ మేరకు ధర్నా కార్యాచరణ కరపత్రాలను శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మున్సిపల్ పారిశుధ్య కార్మికులు, ఇంజినీరింగ్ విభాగాల కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ, యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ ధర్నా చేపడుతున్నట్లు వివరించారు.ఈ నెల 25,26 తేదీల్లో కార్మికులతో గేట్‌మీటింగ్‌ల ద్వారా సమస్యలు తెలుసుకోవడం, సంతకాల సేకరణ,27న కమిషనర్‌లు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలను ఇవ్వడం, 28న మున్సిపల్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేపట్టనున్నట్లు కార్యాచరణ ప్రకటించారు. కార్యక్రమంలో నాయకులు శంకర్రావు, శ్రీను, పోలరాజు, రవి, లక్ష్మి, తౌడమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాలింతలు, గర్భిణులకు సకాలంలో పౌష్టికాహారం



మరిపివలస అంగన్వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ త్రివిక్రమ రావు

సీతానగరం: మండలంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాల ద్వారా బాలింతలు గర్భిణులు, ప్రీస్కూల్ పిల్లలకు నిర్దేశించిన గడువులోగా పౌష్టికాహారాన్ని అందజేయాలని ఎంపీడీఓ త్రివిక్రమ రావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన సూరంపేట సచివాలయాన్ని, అంగన్వాడీ కేంద్రాన్ని, మరిపివలస, చిన్నరాయుడుపేట అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మరిపివలస అంగన్వాడీ కేంద్రంలో మాట్లాడుతూ గ్రామాల్లోని బాలింతలు, గర్భిణుల ఆరోగ్య పరిరక్షణకు పౌష్టికాహారాన్ని ఐసీడీఎస్ ద్వారా అంద జేస్తున్నారన్నారు. అంగన్వాడీ కేంద్రాలకు చేర్చిన పౌష్టికాహారాన్ని నిర్దేశించిన గడువులోగా వారికి పంపిణీ చేయాలని కోరారు. అనంతరం సచివాలయాన్ని సందర్శించి ఉద్యోగుల హాజరు, మూమెంట్ రికార్డులను గ్రామాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులును పరిశీలించారు.

సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా శిక్షణ కేంద్రం సమన్వయ అధికారి ఆర్.శ్రీనివాసరావు

సాలూరు: పంటల సాగులో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన పెంపొందించాలని జిల్లా శిక్షణ కేంద్రం సమన్వయ అధికారి ఆర్.శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు సాలూరు డివిజన్ పరిధిలో పనిచేస్తున్న వ్యవసాయ, ఉద్యాన శాఖ సిబ్బందికి పట్టణంలోని అగ్రిల్యాబ్‌లో శుక్రవారం నిర్వహించిన శిక్షణ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ పంటలకు ఆశించే చీడపీడలు, వాటి నివారణ గురించి వివరించారు. పంటల సాగులో మెలకువలను తెలియజేశారు. ఏడీఏ భారతి మాట్లాడుతూ, రాబోయే రబీ సీజన్‌లో పెసర, మినుము సాగు, కొత్త వంగడాల ఎంపిక, యాజమాన్య పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు మధుసూదనరావు, అనూరాధ, తిరుపతిరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మస్టర్ పాయింట్ వద్ద నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

పార్వతీపురంటౌన్: పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ అన్నారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ కార్యాలయం మస్టర్ పాయింట్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని చట్టబద్ధమైన సెలవులు, పనిముట్లు, రక్షణ పరికరాలు అందజేయాలని డిమాండ్ చేశారు. డెత్, సిక్ పోస్టులలో బిడ్డలకు ఉద్యోగాలు, సాధారణ, ప్రమాద మరణాలకు ఎక్స్ గ్రేషియా చెల్లింపులు, కార్మికులు ఉమ్మడి రాష్ట్రంలో దీర్ఘకాలికంగా పోరాడి సాధించుకున్న వారాంతపు సెలవులు, క్యాజువల్ లీవులు, జాతీయ సెలవులు సక్రమంగా అమలు కావడం లేదన్నారు. కార్మికులపై రోజురోజుకూ పనిభారం పెరుగుతోందని, దొడ్డిదారిన అధికారులు ప్రజాప్రతినిధులు ఇళ్లల్లో పని చేయించుకుంటున్నారని ఆరోపించారు.

పాలకులు ఎంతమంది మారినా మున్సిపల్ కార్మికుల జీవితాలు మారడం లేదని వాపోయారు. ఇందులో భాగంగా సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా కార్మికుల నుంచి సంతకాల సేకరణ, 25, 26వ తేదీల్లో మస్టర్ పాయింట్ల వద్ద ధర్నాలు, 27వ తేదీన ఎమ్మెల్యే/ చైర్‌పర్సన్ వంటి వారి వద్ద సామాజిక రాయబారాలు, 28వ తేదీ మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నాలు నిర్వహించి కమిషనర్‌కు వినతి పత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అధికసంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీఓ ఆకస్మిక తనిఖీ



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీఓ అశుతోష్ శ్రీ వాత్సవ్

పాచిపెంట:

పార్వతీపురం సబ్‌కలెక్టర్, ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీఓ అశుతోష్ శ్రీ వాత్సవ్ శుక్రవారం మండలంలో పర్యటించారు. ఈ మేరకు మండల కేంద్రంలోని ఎమ్ఎల్ఎస్ స్టాక్ పాయింట్‌ను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. సకాలంలో సరుకులు ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం స్థానిక గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించి పదవ తరగతి విద్యార్థినులతో మాట్లాడారు. వారికి అందుతున్న సదుపాయాలు, విద్యాప్రమాణాలపై ఆరా తీశారు. పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థినులను తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు.

అంగన్వాడీల అవస్థలు

- డ్రై రేషన్ పంపిణీలో ఇబ్బందులు
- సహకరించని మొబైల్ ఫోన్లు
- సరుకులు ఇవ్వాలంటే ఎఫ్‌ఆర్ఎస్ తప్పనిసరి
- ఫొటోలు అప్‌లోడ్ కాకపోవడంతో తిప్పలు



పార్వతీపురం టౌన్:

గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం అందించే అంగన్వాడీలకు ఫేస్‌యాప్ రూపంలో మరో పనిభారం పడింది. ఇప్పటికే బాలసంజీవిని ద్వారా లబ్ధిదారులకు ఫేస్ యాప్ ద్వారా రేషన్ ఇస్తుండగా కేంద్రం రూపొందించిన పోషణ్ ట్రాకర్ యాప్‌లో కూడా లబ్ధిదారుల ఫేస్ గుర్తింపు తప్పనిసరి చేస్తూ మరోమారు లబ్ధిదారుల వివరాల నమోదు ప్రారంభించారు. దీంతో రెండు యాప్‌లలో లబ్ధిదారుల ముఖం గుర్తింపు కష్టతరంగా మారింది. నమోదు విషయంలో కనీసం ఐసీడీఎస్ సిబ్బందికి సరైన శిక్షణ కూడా లేకపోవడంతో గందరగోళంగా మారింది. అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు 7నెలలు, 3ఏళ్ల బాలలకు ప్రతినెలా పోషకాహారాన్ని ఇంటికే అందిస్తున్నారు. గతంలో కేంద్రం వద్ద వండి ఇచ్చేవారు.

సరుకులు ఇవ్వాలంటే ఎఫ్‌ఆర్ఎస్ తప్పనిసరి

ఎక్కువమంది నుంచి టేక్ హోమ్ రేషన్(టీహెచ్ఆర్) కావాలంటూ అభ్యర్థనలు రావడంతో పాలు, గుడ్లు, నూనె, పప్పు బియ్యం వంటివి లబ్ధిదారులకు ప్రతినెలా రెండు దఫాలుగా ఇస్తున్నారు. టీహెచ్ఆర్ పంపిణీలో అవకతవకలు జరగకుండా ప్రభుత్వం ఎఫ్ఆర్ఎస్‌ను ప్రవేశపెట్టింది. లబ్ధిదారులు వచ్చిన సమయంలో వారి ముఖచిత్రం ద్వారా గుర్తించి యాప్‌లో నమోదు చేసి టీహెస్ఆర్ అందించేవారు.

ఇక గర్భిణులు, బాలింతలు, చిన్నారుల పూర్తి వివరాలను మరోసారి పోషణ్ ట్రాకర్ యాప్‌లో నమోదు చేయాలని ఆదేశాలు జారీ అయ్యా యి. ఈ యాప్‌లో కూడా లబ్ధిదారుల ముఖచిత్రాన్ని రిజిస్ట్రేషన్ చేయాల్సి వస్తోంది. ఒకే వ్యక్తి వివరాలను రెండు యాప్‌లలో నమోదు చేయడం టీహెచ్ఆర్ పంపిణీ సమయంలో ఒకే వ్యక్తికి రెండుసార్లు ఫేస్‌యాప్ గుర్తించడం ఇబ్బందికరంగా మారింది. ఇందుకు ప్రభుత్వం అంగన్వాడీలకు ఇచ్చిన ఫోన్లు అనుకూలంగా లేకుండా మొరాయిస్తున్నట్లు తెలుస్తోంది.

అధికార యంత్రాంగం ఒత్తిడి..

నిర్ణీత సమయంలో యాప్‌లలో వివరాలను నమోదు చేయాలంటూ యంత్రాంగం ఒత్తిడి తీసుకువస్తుంటే పోషణ్ ట్రాకర్ పూర్తిస్థాయిలో పనిచేయని పరిస్థితి నెలకొంది. ఈ విధానంపై సరైన శిక్షణ ఇవ్వలేదు. ఫేస్ యాప్‌లో నమోదు చేసేటప్పుడు లబ్ధిదారుల ఫోన్‌కు ఓటీపీ వెళ్తుంది. దీన్ని చెప్పడానికి వారు సందేహిస్తున్నారు.

– అంగన్వాడీ కార్యకర్త, పార్వతీపురం